క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక బాలురు, బాలికల గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నోడల్ ప్రిన్సిపాల్ పైడి నాగభూషణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, వొకేషనల్ గ్రూపులకు ఆన్‌లైన్‌లో వచ్చే నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024 ఎస్ఎస్‌సీ పాసైన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీఎల్ఓలు అందుబాటులో ఉండాలి

పాలకొండ: బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలని తహసీల్దార్ వరహాలు సూచించారు. మండలంలోని కొండాపురం గ్రామంలో పోలింగ్ కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో పాఠశాలల తాళాలు బీఎల్ఓలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రోజు పోలింగ్ కేంద్రం వద్ద పరిశీలన చేసి ఎన్నికల వరకు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రూ.40 లక్షలతో బీటీరోడ్డు



బస్టాండ్ నుంచి అమ్మవారి గుడివరకు నిర్మించిన బీటీరోడ్డు

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురంలో అమ్మవారి గుడి నుంచి బస్టాప్ వరకు రూ.40 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇదివరకు మట్టిరోడ్డు ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సమస్యను ఎమ్మెల్యే జోగారావు దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి జీజీఎంపీ నిధులు రూ.40 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో అమ్మవారి ఆలయం నుంచి బస్టాప్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీ తీరాన వెలసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షిక మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మూడురోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరిరోజు స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బలిజిపేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీఓ రమేష్ నాయుడు అన్నారు. మండలంలోని సుభద్రలో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రెండు పూటలా పనులు చేయాలని, ఎండ తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. జాబ్‌కార్డు ఉన్నవారికే పనులు కల్పించాలన్నారు. నిర్దేశిత కొలతల మేరకు పనులు చేసినట్లయితే గరిష్ఠ వేతనం వస్తుందన్నారు. ఆయన వెంట ఏపీఓ కేశవరావు ఉన్నారు.

89 మందికి వైద్య సేవలు

పార్వతీపురంటౌన్: ప్రతీ గ్రామంలో నెలకు రెండు సార్లు 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ ఐశ్వర్య అన్నారు. మండలంలోని సూడిగాం గ్రామంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 89 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు, గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా 13 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు అందజేస్తున్నామని వివరించారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్నకే అండగా నిలుస్తాం..



- నిన్ను నమ్మం బాబూ.. అంటున్న మహిళలు
- 2014లో డ్వాక్రా రుణ మాఫీ హామీని విస్మరించిన చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 46,170 మందికి లబ్ధి
- రూ.83.85 కోట్ల రుణ మాఫీ

డ్వాక్రా మహిళలు

కురుపాం:

రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అండగా నిలుస్తోంది. ఆర్థికంగా నిలదొక్కుకునేలా అన్ని విధాల సాయం అందజేస్తోంది. మహిళల సాధికారతే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ చేయూతనిస్తోంది. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీల ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్థికంగా ఆదుకునేందుకు డ్వాక్రా రుణమాఫీ అమలుకు శ్రీకారం చుట్టారు. కురుపాం నియోజకవర్గం పరిధిలో ఉన్న ఐదు మండలాల్లో ఐదేళ్ల పాలనలో ఎస్‌హెచ్‌సీ సంఘాల పరిధిలోని మహిళలకు సున్నా వడ్డీ రుణాలు అందించడంతో పాటు దశల వారీగా రుణమాఫీ చేసి వారి సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి జగన్ ప్రభుత్వం దోహదపడిందని మహిళలు సంబరపడుతున్నారు. కురుపాం నియోజకవర్గంలోని కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి మండలాలకు చెందిన 4,138 మహిళా సంఘాలకు చెందిన 46,170 మంది అర్హులైన డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రూ.83.85కోట్లు రుణ మాఫీ చేసింది. దీంతో 2014లో మాటిచ్చి మోసం చేసిన చంద్రబాబు కంటే మాటిస్తే మడమ తిప్పని జగనన్న వైపే వచ్చే ఎన్నికల్లో నిలుస్తామని చెబుతున్నారు. చంద్రబాబును నమ్మం బాబూ అంటూ తేల్చి చెబుతున్నారు.

కురుపాం నియోజకవర్గంలో నాలుగు విడతలుగా జరిగిన రుణ మాఫీ వివరాలు...

మండలం	సంఘాలు	మొత్తం సభ్యులు	రుణమాఫీ (రూ.కోట్లలో..)
కురుపాం	626	6876	12.10
జి.ఎల్.పురం	565	6489	8.56
జి.ఎం.వలస	1094	12241	22.79
కొమరాడ	860	9562	17.14
గరుగుబిల్లి	993	11002	23.25
మొత్తం	4138	46170	83.35

ఆర్థికంగా వృద్ధి చెందాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆర్థికంగా వృద్ధి చెందాం. మాది గాయత్రి మహిళ సంఘం. మా సంఘానికి ప్రతీ ఏడాది వైఎస్సార్‌సీపి ప్రభుత్వం హయాంలో రూ.1,15,500 చొప్పున రుణమాఫీ జరిగింది. సంఘంలో ఉన్న 11 మంది సభ్యులు ఆర్థికంగా లబ్ధి పొందాం. మళ్లీ సీఎంగా జగనే రావాలి.

రాజాన సోమేశ్వరి, వెంకటరాజుపురం, జియ్యమ్మవలస మండలం

చంద్రబాబును నమ్మేది లేదు..



2014లో డ్వాక్రా రుణమాఫీ అంటూ మాట ఇచ్చి మడమ తిప్పిన చంద్రబాబును నమ్మేది లేదు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీ చేపట్టారు. మాది లక్ష్మీ స్వయం సహాయక సంఘం. మా సంఘంలో 9 మందికి నాలుగు విడతల్లో రూ.4,04,568 రుణమాఫీ వచ్చింది. ఒక్కొక్కరికి నాలుగేళ్లలో నేరుగా బ్యాంకు ఖాతాల్లో రూ.44,952 నగదు జమైంది. జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు చేసిన మేలు మరువలేనిది.

– చిట్టుబత్తుల నాగమణి, గంగరేగువలస, కొమరాడ మండలం

జగనన్న పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి

- ప్రతీ కుటుంబానికి లబ్ధి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి



దీసరిగూడలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, సంక్షేమ లబ్ధి ప్రతీ కుటుంబానికి అందుతోందని వచ్చే ఎన్నికల్లో ఆయన విజయం సాధించి మరోసారి సీఎం కావడం ఖాయమని పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని హడ్డుబంగి, చింతాడ, కింద్రువాడ, దీసరిగూడ, బుడ్డడుగూడ, దేవనాపురం, పెదరామ, కోపువలస, వంబరెల్లి పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించాలని కోరారు. పరిపాలనా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చి పేదవాడికి మంచి చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఆయనను ఎదుర్కొనే ధైర్యం లేక చంద్రబాబు, జనసేన, బీజేపీ పార్టీలతో పొత్తు పెట్టుకుని కుటిల రాజకీయం చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో ఈ మూడు రాజకీయ పార్టీలు 650 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల్ని విమర్శించి నేడు వాటినే అమలు చేస్తానని వాగ్దానాలు చేయడాన్ని ప్రజలు గమనించాలన్నారు. చంద్రబాబు మరోమారు ప్రజల్ని మోసగించడానికి విఫలయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి మేలు జరిగితేనే ఈ ఎన్నికల్లో ఓటు వేయాలని కోరుతున్న దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటింటికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పేదల పక్షాన నిలబడుతున్న జగనన్నకు ప్రజలంతా అండగా ఉండాలన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుకోసం ఆలోచించడం లేదని పాలకొండ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీయే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కె.సరస్వతి, ఎం.విజయలక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మోహన్‌రావు, సర్పంచ్‌లు తిరుపతిరావు, సుశీల, కళావతి, ఆదిలక్ష్మి, మౌనిక, విజయలక్ష్మి, వెంకునాయుడు, ఎంపీటీసీ చంద్రశేఖర్, పార్టీ మండల కన్వీనర్ జి.సుమిత్రరావు, ఎ.లిల్లీపుష్పనాథం, ఎస్.రాము, ఎన్.కాంతారావు, బి.అప్పారావు, ఎన్.అబ్బాస్, ఎస్.మహేష్, ఎస్.వెంకటేష్, కృష్ణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేలతల్లి బాగు



గవరమ్మపేటలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకాశ్

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట గ్రామంలో నవధాన్యాల సాగుపై రీజనల్ థిమోటిక్ లీడ్ కె.ప్రకాశ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు తప్పనిసరిగా 20 నుంచి 30 రకాల విత్తనాలను నవధాన్యాలుగా వేసుకోవడం వల్ల ఇంటి అవసరాలు తీర్చుకోవడమే కాకుండా పశువుల దాణాకు కూడా ఉపయోగపడుతుందని, భూమి సారవంతం అవుతుందని, ప్రధాన పంటకు అవసరమైన సూక్ష్మ స్థూల పోషకాలు సమృద్ధిగా లభించడం వలన పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని అన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు, నూనెగింజలు ,సుగంధ ద్రవ్యాల విత్తనాలు కలిపి ఎకరాకు 10 నుంచి 15 కేజీల మోతాదులో వేసుకోవాలని సూచించారు. రీజనల్ పరిధిలోని ప్రతి రైతు తొలకరి వర్షాలకు ముందుగానే నవధాన్యాల కిట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యకర్తలు రైతులకు అందుబాటులో ఉండి తగు సూచనలు, సలహాలు అందివ్వాలని సూచించడం జరిగింది. కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, ఎన్జీవో ప్రతినిధి దేవుళ్లు, జిల్లా డీపీఎం పి.షణ్ముఖరాజు, ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జ్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో బహుళ పరిజ్ఞానం

పాలకొండ రూరల్: ప్రతి నిత్యం పుస్తకాలను చదవటం వలన బహుళ పరిజ్ఞానం సంపాదించవచ్చని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి బబ్బూరి గణేష్‌బాబు అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అందుబాట్లో ఉన్న వివిధ పోటీ పరీక్షల, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, చారిత్రిక, ఇతిహాస గ్రంథాలతో పాటు వివిధ రంగాలకు సబంధించిన పుస్తకాలను ప్రదర్శించారు. పాఠకులకు పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత, ఉద్యోగ అన్వేషితులు, విద్యార్థులు సమయం వృథా చేయకుండా ప్రస్తుత వేసవి సెలవుల్లో గ్రంథాలయాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు.

నాలుగు దశాబ్దాల నీటి సమస్యకు చెక్



రుద్రిపేట వీధి కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన రక్షిత కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీరు

పాలకొండ రూరల్: మండల కేంద్రానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న వెలగవాడ పంచాయతీలో 2వేల 781 మంది జనాభా. 867 గృహాలు ఉన్నాయి. వీరి తాగునీటి అవసరాలకు 20వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత నీటి పథకం పంచాయతీ కేంద్రంలో ఉన్నా తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తుండేది. ముఖ్యంగా ఈ పంచాయతీ పరిధిలో అనుబంధ గ్రామమైన రుద్రిపేటలో తాగునీటి సమస్య మరింత జటిలమైంది. పంచాయతీ కేంద్రంలో ఉన్న రక్షిత పథకం ద్వారానే నీరు ఈ గ్రామానికి రావాల్సి ఉండేది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా వేసవి పేరు వింటేనే హడలిపోయేవారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ చొరవతో గ్రామానికి మంజూరైన నిధుల నుంచి రూ.6 లక్షలపైబడి ఖర్చుతో రామ మందిరం వద్ద ఏర్పాటు చేసిన సింథటిక్ రక్షిత పథకం నిర్మించారు. తద్వారా పలు వీధి కూడళ్ల వద్ద కుళాయిలు ఏర్పాటుచేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామస్తులు, సర్కారు చొరవ ఫలితంగా నేడు తాగునీటి సమస్యకు దాదాపు 40 ఏళ్ల తరువాత పరిష్కారం లభించింది. గుక్కెడు నీటి కోసం గొంతెత్తిన ప్రజలే ఇప్పుడు ప్రభుత్వ చొరవకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు గ్రామంలో ఉన్న తాగునీటి బోర్లును కూడా యంత్రాగం పూర్తి స్థాయిలో అందుబాట్లోకి తీసుకురావటం విశేషం.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పాలకొండ రూరల్: స్థానిక 11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి మంగళవారం తెలిపారు. ముఖ్యంగా ఎంఎం.నగర్, సీఎల్.నాయుడు నగర్, శ్రీనివాస నగర్, కోమటిపేట, దేవరపేట, ఎన్‌కే.రాజపురం, వెంకమ్మపేట, పెద్ద, చిన్న కాపువీధులు, శ్రీకాకుళం, సీతంపేట రహదారుల్లో, వెలగవాడ, ఓని, విజయరాంపురం, పరుశరాంపురం, సిరికొండ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

రేగిడి: సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూకాలమ్మ సూచించారు. మండలంలోని అంబఖండి గ్రామంలో ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించిన ఆమె.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. లబ్ధిదారులకు పక్కాగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు, బాలామృతం అందజేయాలన్నారు.

ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని, సమాజ హితానికి ఇది చాలా మంచిదని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. మండల కేంద్రంలోని దత్తపీఠంలో దివ్యజీవన సత్సంగ సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రేతాయుగంలో భగవంతుడు మానవరూపంలో రాముడిగా అవతరించారని, అప్పట్లో సత్యం, ధర్మం, శాంతి, ప్రేమతో ప్రజలు జీవించేవారన్నారు. సంపాదనలో కొంత మొత్తాన్ని ఆధ్యాత్మిక, సత్సంగ కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో దత్త పీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు, ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యన్నారాయణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



జయమణి టీచర్‌ను బగ్గీపై తీసుకువెళుతున్న విద్యార్థులు, సహోపాధ్యాయులు

పాలకొండ రూరల్:

స్థానిక హడ్కో కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న కంబాల జయమణికి సహ ఉద్యోగులు, విద్యార్థులు మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. మరికొద్ది రోజుల్లో ఆమె పదవీ విరమణ పొందనుండటం, వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం ఎం.రామలక్ష్మి నేతృత్వంలో విద్యార్థులు తమ ఉపాధ్యాయినికి ప్రత్యేక బగ్గీపై పాఠశాల నుంచి ఆమె స్వగృహం వరకు సాగనంపారు. ఈ సందర్భంగా సదరు ఉపాధ్యాయిని అందించిన సేవలు, పాఠశాలలో నిర్వహించిన సామాజిక సేవలను గుర్తు చేసుకున్నారు.

వలంటీర్ల స్వచ్ఛంద రాజీనామాలు



పాలకొండ రూరల్: రాజీనామా పత్రాలు ఎంపీడీవోకు అందజేస్తున్న అవలంగి వలంటీర్లు



భామిని: ఘనసరలో రాజీనామా పత్రాలు డీడీఓ విజయకు అందజేస్తున్న వలంటీర్లు

పాలకొండ రూరల్: మండలంలోని వలంటీర్ల స్వచ్ఛంద రాజీనామాల పర్వం కొనసాగుతుంది. పాలకొండ మండలం అవలంగి గ్రామానికి చెందిన ఏడుగురు వలంటీర్లు తమ విధులకు మంగళవారం రాజీనామా చేశారు. సంబంధిత రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణకు అందించారు.

భామిని: మండలంలో గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఘనసర సచివాలయం పరిధిలోని 11 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేసి డీడీఓ విజయకు పత్రాలు అందజేశారు. నులకజోడు సచివాలయం పరిధిలో పది మంది వలంటీర్లు రాజీనామా చేశారు. డీడీఓ విశ్వేశ్వరరావుకు రాజీనామా పత్రాలు అందజేశారు.

హాయిగా.. ప్రయాణం...



చింతాడ గ్రామానికి నిర్మించిన నూతన రహదారి



చింతాడ గ్రామ రహదారి దుస్థితి

పాలకొండ మండలం చింతాడ గ్రామ రహదారిని దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోలేదు. రాళ్లు తేలిపోవడంతో పాదచారులు సైతం నడిచేందుకు ఇబ్బంది పడ్డారు. గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. జగనన్న ప్రభుత్వంలో ఈ రహదారికి మహర్దశ పట్టింది. రూ.50 లక్షలతో దాదాపు 3.4 కిలోమీటర్ల రహదారి పనులు పూర్తి చేశారు. పాలకొండ – వీరఘట్టం సీఎస్‌పీ రహదారి నుంచి చింతాడ గ్రామానికి రహదారి వేశారు. దీంతో ఆ గ్రామస్తుల రహదారి కష్టాలు తీరాయి. దీంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

– పాలకొండ రూరల్

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

- డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

సాలూరు: గర్భిణులు, బాలింతల ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పకుండా నమోదు చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు ఆదేశించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో అందిస్తున్న ఆరోగ్య సేవలపై ఆరాతీశారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య సేవలందించాలని సూచించారు. గర్భిణుల వివరాలను మొదటి మూడు నెలల్లోనే నమోదు చేయాలని, తద్వారా వారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు వీలుంటుందన్నారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని, కాన్పు తరువాత మాతా, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా డీహైడ్రేషన్‌కు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శివకుమార్, డీఎంఓ జగన్మోహనరావు, ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డా.రఘుకుమార్, ఎఫ్‌డీసీ ప్రోగ్రాం అధికారి డా.వినోద్, ఎపిడిమాలజిస్ట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

రేగిడి: ఎన్నికల వేళ పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. మండలంలోని సంకిలి, బూరాడ, చిన్నశిర్లాం, ఉంగరాడమెట్ట కూడళ్ల వద్ద ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలు అతిక్రమిస్తూ డబ్బు, మద్యం అక్రమంగా రవాణా కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

రేగిడి: చైత్ర పౌర్ణమి పురస్కరించుకుని, మండలంలోని ఆమదాలవలస, రేగిడి, అంబఖండి, వన్నలి, గోపింపేట గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో కొలువైన స్వామి వారికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి కిన్నెర కాంతం అన్నారావు ఆధ్వర్యంలో ప్రత్యేకాభిషేకాలు కూడా చేసి, భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు.

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని బావిరేతమ్మ ఆలయం వద్ద భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆలయాన్ని సంప్రోక్షణ చేసి, నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రారంభాన్ని పురస్కరించుకుని, అధిక సంఖ్యలో మహిళలు ముర్రాటలు సమర్పించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.